

# రిటైర్డు ఆఫీసరు వెంకట్రామయ్య

అన్నపూర్ణ

"మధుసూదనరావు గారు రిలయన్స్ కంపెనీలో షేర్లు కొంటూ, మిమ్మల్ని కూడా కొనమన్నారుటగా" అంది భర్తతో అనసూయమ్మ

"రిలయన్స్ కంపెనీ షేర్ల గురించి నీకెవరు చెప్పారు?" అన్నారు వెంకట్రామయ్యగారు.

"సరస్వతమ్మగారు చెప్పింది. అవును, ఆయన కొంటున్నప్పుడు మీరు కూడా కొనలేకపోయారా?"

"నీకు అసలు ఈ షేర్ల గురించి ఏమైనా తెలుసునా?" అడిగారు వెంకట్రామయ్యగారు.

"ఏమో, నాకు తెలియకపోవచ్చు. కాని సరస్వతమ్మగారు చెప్పింది. వాళ్లాయన ఏవేవో కంపెనీల్లో షేర్లు కొంటూ ఉంటారుట. అమ్ముతూనూ వుంటారట. ఆమధ్య ఏదో కంపెనీ షేర్ల ఖరీదు పెరిగితే, ఆ కంపెనీలో తనకున్న షేర్లు అమ్మితే వచ్చిన లాభంతో మనవడి బారసాలెకు ఒక బంగారు గొలుసు చేయించారుట. డబ్బు వస్తూ వుంటే చేదాయేమిటండీ?" అంది అనసూయమ్మ

"షేర్లు కొనడం, అవి తర్వాత అమ్మడం వల్ల అప్పుడప్పుడు డబ్బు రావచ్చు. నిజమే. కానీ షేర్ల వాల్యూ పడిపోతే డబ్బు పోవచ్చును కూడాను. అది నీకు తెలుసా. ఈ షేర్ల వ్యాపారం అనేది ఒక జూదం. గుఱ్ఱపు పందాలు, పేకాటలాటి జూదమన్న మాట. షేరు వాల్యూ పెరిగితే మధుసూదనరావుకి డబ్బు వచ్చిందన్నావు. విలువ పడిపోతే నష్టం రావచ్చును కూడాను. క్రిందటి ఏడాది జరిగిన 'స్కామ్'ను గురించి నువ్వు విన్నావా? ఎన్ని కుటుంబాలు ఈ షేర్ల వ్యామోహంలో పడి నాశనమయ్యాయో నీకేమైనా తెలుసునా? అప్పట్లో చిన్న చిన్న మొత్తాలు కాదే! ఉన్న ఆస్తులు పోయి వీధిన పడినవారు చాలామంది వున్నారు. గుఱ్ఱపు పందాలలో డబ్బు పెట్టి గడించిన వారు వుండవచ్చును. కానీ ఎంత మందో ఆ జూదంలో తమ సర్వస్వాన్నీ పోగొట్టుకున్నవారు వున్నారు. నా ఉద్దేశ్యంలో ఈ షేర్ల వ్యాపారం కూడా అటువంటిదే. ఈ వయస్సులో డబ్బు వస్తుందో, పోతుందో అంటూ ఆందోళనతో టెన్షన్ పెంచుకోవడం వంటికి మంచిదంటావా? ఈ షేర్ల వ్యాపారంలోకి ఒకసారి దిగావంటే అయస్కాంతలా లాగి మనని ఆ ఊబిలోంచి బయటకు రానివ్వదు."

"మీరు ఎప్పుడూ ఇలాగే మాట్లాడతారు. షేర్లు కొంటున్నవారందరూ తెలివితక్కువ దద్దమ్మలని మీ ఉద్దేశం. మధుసూదనరావు గారినే తీసుకోండి. రిటైరయి పది సంవత్సరాలయినా ఇంకా డబ్బు గడించాలనే ఆశ, పట్టుదల ఉన్నాయి. షేర్ల వ్యాపారంలో మీరు చెప్పినట్లు డబ్బు పోతుందీ అంటే ఆయన షేర్ల గురించి ఆలోచిస్తారని అనుకోను. సరస్వతమ్మగారు చెప్పింది ఆయన తమిద్దరి పేర్ల మీదనే గాక, కొడుకులు, కూతుళ్లు, అఖరికి కోడళ్ల పేర్ల మీద కూడా షేర్లు కొంటూనే ఉంటారుట. అందరికీ వేర్వేరు ఫైల్సు

ఏర్పాటుచేసి షేర్లకు సంబంధించినవన్నీ జాగ్రత్తపరుస్తారుట. మీరు చెప్పినట్లు ఈ షేర్ల వ్యాపారం అంతా నష్టమే అయితే ఆయన అంత శ్రద్ధ చూపిస్తారనుకోను. ఆయనంత అమాయకుడేమీ కాదు."

"షేర్లు కొనడంలో అన్నీ నష్టాలే అనను. జాగ్రత్తగా వుంటే లాభం వుంది. కానీ అది కూడా ఒక జూదం వంటిదంటాను. జూదాలు మనకెందుకంటాను. అయినా మనకున్నది చాలదుటే. పిల్లలను పెద్దవాళ్ళను చేశాము. మనం ఇంతవరకు జీవితం బాగానే గడిపాము. తిండికి ఎప్పుడూ ఆ భగవంతుని దయ వల్ల బాధపడలేదు. మనం భాగ్యవంతులం కాకపోవచ్చును. భాగ్యవంతులైనంత మాత్రాన వాళ్లందరూ సుఖవంతులంటావా? ఏదో భగవంతుడు మనకిచ్చినంత మనం అనుభవిస్తున్నాం. ఈ షేర్ల వ్యాపారంలో పడి, లేనిపోని కష్టాలు కొనితెచ్చుకోడం నాకు యిష్టం లేదు" అన్నారు వెంకట్రామయ్యగారు.

"ఆ! మీకున్న ఈ వైరాగ్యం వల్లే మనకు డబ్బు రావడం లేదు. లక్ష్మి 'చాలు' అంటే గడప తొక్కదండీ. రమ్మని ఆహ్వానిస్తేనే వస్తుంది. 'మనకున్నది చాలదా' అంటారు. మనకేం వుంది? రిటైర్ అయ్యారు. ఉండటానికి స్వంత యిల్లయినా ఉందా? ఎప్పుడూ ఈ అద్దె యిళ్లల్లోనేనా వుండాలి, లేదా కోడళ్ల దయాదాక్షిణ్యాల మీద కొడుకుల దగ్గరైనా వుండాలి. ఎవరైనా డబ్బు కావాలి అంటారు. ఇదేం చోద్యమో! మీరు 'వున్నది చాలులద్దూ' అంటారు. ఇంత వైరాగ్యమేమిటండీ మీకు" అంది అనసూయమ్మ చిరుకోపంతో.

"అది సరేగానీ, ఎవరో బెల్లు కొట్టినట్టున్నారు. చూడు, వెళ్లి తలుపు తియ్యి."

అనసూయమ్మగారు రుసరుసగా తలుపు తీయడానికి వెళ్లి, "ఉన్నారు, రండి" అంటూ ఆ వచ్చిన పెద్ద మనిషిని లోనికి ఆహ్వానించింది.

"నమస్కారం సార్! బాగున్నారా?" అంటూ వెంట్రామయ్య గారిని పలకరించాడు ఆ వచ్చినాయన.

"నమస్కారం, చలపతిగారూ! రండి, రండి. ఏవిటీ ఈమధ్య అసలు కనబడటం లేదు. మీరు ఉద్యోగస్థులు కదా! ఖాళీ ఎక్కడ వుంటుంది?" అంటూ చిరునవ్వుతో ఎదురుగా వున్న కుర్చీ చూపారు వెంకట్రామయ్యగారు.

"అదేం కాదండీ. మా ఉద్యోగాల గురించి మీకు తెలియనిదేముంది. గవర్నమెంటు ఆఫీసుల్లో వర్కుని గురించి మీకు తెలుసుగా. ఒకరు చేసే పనికి నలుగురు వుంటారు. ఆ నలుగురులో 'నేనే ఎందుకు చేయాలి, మిగతావారు వున్నారు గదా' అంటూ శ్రద్ధ చూపించక ఎవరికి వారు తప్పుకుంటారు. దీనివల్ల జరగవలసిన పని జరగదు. 'ఫైల్లు కదలటం లేదు అంటారు' చూడండి. ఈ కదలకపోవడం ఫైల్లు ఎక్కువై కాదు. ఆ ఫైలు ఎవరు చూడాలి అనే వంతులాట వల్లే. అది సరేగానీ సార్! ఏవిటి, మీరు నిన్న డాక్టర్ రావుగారి అమ్మాయి వెడ్డింగ్ రిసెప్షన్‌కి రాలేదు?" అన్నారు చలపతి.

"డాక్టర్‌గారింటికి నిన్న ఉదయం నేను, మా ఆవిడ వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి వచ్చాము. నాకు ఈ రిసెప్షన్‌లకు వెళ్లడం అంత ఇష్టం ఉండదు. 'ఈయన వెంకట్రామయ్యగారు, ఒక సంవత్సరం క్రితం రిటైరు అయ్యారు' అని నన్ను పరిచయం చేయడం, 'అయ్యో! పాపం రిటైర్ అయ్యారా!' అన్నట్లు తలాడించి, నాకు పరిచయం చేయబడిన వారందరూ కర్టిసీ కోసం నమస్కారాలు పారేసి, చేతులు దులుపుకుని, వారి వారి గ్రూపు సంభాషణలలో నిమగ్నులవడం, నేను ఏదో ఒక మూల కుర్చీ చూసుకుని, దిక్కులు చూస్తూ ఇంటికి వెళ్లే టైముకి ఎదురుచూడటం, ఇవన్నీ అనవసరంగా కొని తెచ్చుకున్న బాధలని నా ఉద్దేశ్యం. అంచేత ప్రస్తుతం నేను రిసెప్షన్‌లకు వెళ్లటం లేదండీ. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఇట్టి పార్టీలకు తప్పనిసరిగా వెళ్లవలసి వచ్చేది. అప్పుడు మా ఆవిడ కూడా చాలా హుషారుగా వుండేది. ఒక పెద్ద ఆఫీసరు భార్యగా వెళ్లడం, అందరి నమస్కారాలు అందుకోవడం, హుందాగా కబుర్లు చెప్పడం, ఇదంతా దానికి చాలా ఉత్సాహంగా వుండేది.

అలాంటి పార్టీల కోసం అది ఎదురుచూస్తూ వుండేది కూడాను. ఇప్పుడు రిటైరయిన ఒక సామాన్యుని భార్యగదా! అంచేత అది కూడా పార్టీలకు వెళ్లడానికి యిష్టం చూపటం లేదు. తన భర్త రిటైర్ అయినందుకు తనను చూసి అందరూ జాలిపడతారేమోనని, ఆ అలవాటుపడిన మర్యాదలు అందవేమోనని భయం. చాలా కాలానికి మేమిద్దరం ఏకాభిప్రాయానికి వచ్చిన విషయం ఇది ఒక్కటే" అన్నారు వెంకట్రామయ్యగారు నవ్వుతూ.

"అలా ఎందుకనుకోవాలండీ. మిమ్మల్ని గురించి తెలిసినవారు మిమ్మల్ని తక్కువగా అంచనా ఎలా వెయ్యగలరండీ? మీలాంటివారు నలుగురిలో వుంటే మాలాంటి చిన్నవారు తెల్సుకోదగ్గ విషయాలు ఎన్నో వుంటాయి. తెలుసుకునే అవకాశం కూడా కలుగుతుంది," అన్నారు చలపతి.

"మీకు నాయందున్న గౌరవం చేత మీరిలా అంటున్నారు. అది సరే, నా రిటైర్‌మెంటును గూర్చి ఇంకొక మాట చెప్పనా? ఈ రిటైర్‌మెంటు, నాకు చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్న విశ్రాంతి. నాకని ఉపయోగించే టైమని నాకిచ్చింది. కానీ మా ఆవిడకు మాత్రం నేను ఈవిధంగా ఖాళీగా ఉండటం ఇష్టం లేదు. ఒంట్లో శక్తి వుంది కాబట్టి ఏదైనా ఉద్యోగంలో చేరి కాస్త డబ్బు సంపాదిస్తే బాగుంటుందని దాని ఉద్దేశ్యం. అది డబ్బు పిచ్చి అనను. అందరూ ఏదో విధంగా సంపాదిస్తున్నారు కదా! తన భర్త మాత్రం వారందరిలోకీ ఏం తక్కువ అని. ఆ! డబ్బు పిచ్చి అంటే జ్ఞాపకం వచ్చింది. ఏవిటండీ! ఈమధ్య ఎక్కడ విన్నా, 'ఫలానావాడు కొన్ని వందల కోట్ల రూపాయలు ఫారిన్ బ్యాంకుల్లో జమ చేసుకున్నాడు' అని. ఇన్ని కోట్ల రూపాయలు మనిషి ఏం చేసుకుంటాడండీ. ఏదో కొన్ని లక్షలు వెనుకేసుకున్నాడూ అంటే అర్థం ఉండవచ్చును. కాని ఇంత డబ్బు మనిషికి అవసరం అంటారా?"

"అవసరం అంటే ఏమిటి సార్! అవసరాలకే డబ్బు సంపాదన అయితే డబ్బు కోసం యిన్ని అవస్థలు ఎందుకండీ!"

"అవసరాలకే కాదనుకోండి. తమ పిల్లల భవిష్యత్తు పూలబాటలా చేయడానికే అనుకోండి. అందుకోసం కోట్ల కొలది డబ్బు అవసరమా? వెనుకటికి ఒకాయన అన్నాడట: 'నీకు మూడు వందల కోట్ల రూపాయలు ఇస్తాను. రోజుకి పదివేలు ఖర్చు చేస్తే నీకు ఆ డబ్బు ఎంతకాలం వస్తుంది' అని. మీరు అంచనా వేయగలరా, చలపతిగారూ!"

"మూడు వందల కోట్ల రూపాయలా? రోజుకి పదివేలు ఖర్చా? అబ్బా! రెండూ గొప్పగానే ఉన్నాయండి. ఒక వంద సంవత్సరాలు నిరంభ్యంతరంగా ఖర్చు పెట్టుకోవచ్చుననుకుంటాను" అన్నారు చలపతి.

"ఏవిటీ! వంద సంవత్సరాలా? మీరు మూడు వందల కోట్ల రూపాయలను చాలా తక్కువగా అంచనా వేస్తున్నారు. రోజుకి పదివేలు ఖర్చు పెడితే ఇంచుమించు వెయ్యి సంవత్సరాలు నిరభ్యంతరంగా వస్తుంది. అంటే ఎన్ని తరాలో లెక్క కట్టండి. ఇంకా మనం బ్యాంకుల్లో ఆ డబ్బు నిలవ, దానిమీద వచ్చే వడ్డీ యివన్నీ లెక్కలోకి తీసుకోనేలేదు. చూసారా! మరి వీళ్లందరూ ఇంత కోట్లకొలది డబ్బు సంపాదించడానికి ఇన్ని కష్టాలు పడుతూంటే ఆశ్చర్యంగా లేదూ? దీనికి ఒక హద్దు అంటూ లేదా?"

"ఆశ్చర్యానికేముందండీ? ప్రస్తుత ప్రపంచంలో డబ్బుకే గదండీ విలువ. డబ్బు లేనివాడిని ఎవరైనా లెఖ్ఖ చేస్తున్నరా? మనిషికి అక్షరజ్ఞానం, ప్రపంచజ్ఞానం లేకపోయినా, ఉన్న డబ్బుతో సంఘంలో గౌరవం సంపాదించి పెద్ద మనుషుల్లా చలామణీ అవడం మనం చూస్తూనే ఉన్నాం గదండీ. అంచేత డబ్బు సంపాదన ఒక ముఖ్య వ్యాపకంగా తయారైంది. ఈ సంపాదనకి హద్దు అంటూ లేదా అన్నారు. హద్దు ఏమిటండీ? మనిషి తత్త్వమే అంత. ఆశ అనేది అందులో ఒక భాగం. వస్తున్న కొద్దీ ఇంకా సంపాదించాలనే కోరిక. అది దురాశ అని మీ ఉద్దేశ్యం. అయినా డబ్బు సంపాదించాలనే కోరిక, పట్టుదల లేకపోతే, డబ్బు దానంతట అది మన దగ్గరకు వచ్చేయదండీ."

"ఏమిటీ! మీరూ మా ఆవిడలాగే మాట్లాడుతున్నారు. 'లక్ష్మి ఆహ్వానిస్తేనే వస్తుంది కాని, మనకున్నది చాలు అంటే మనవైపు చూడదండీ' అంటుంది మా ఆవిడ. ఇప్పుడు మీ మాటలు వింటూంటే నాకు మరిన్ని అక్షింతలు పడవచ్చును. అవును, మీ పిల్లలకు ఇప్పుడు పరీక్షల టైమనుకుంటాను. వాళ్లు రణ రంగం నుంచి నిష్క్రమించి శాంతిపథాన్ని చేపట్టినట్టున్నారు" అన్నారు వెంకట్రామయ్యగారు నవ్వుతూ.

"అవునండీ! వాళ్లు చదువుల్లో చాలా బిజీగా వున్నారు. అల్లరికి, పోట్లాటలకి టైమ్ దొరకడం లేదు. ఒక పదిరోజులు మాకు, మాతోబాటు మీకు టెన్షన్‌లెస్ రోజులు. వస్తాను సార్, మళ్లీ కలుస్తాను" అని శలవు తీసు

కున్నారు చలపతి.

• • •

వెంకట్రామయ్యగారు రిటైరయి సంవత్సరమైంది. అప్పటి నుంచి మా యింటి పైవాటాలో అద్దెకుంటున్నారు. ఆయన పెద్ద ఉద్యోగమే చేసి, రిటైర్ అయ్యారు. కానీ సంపాదించినదంతా పిల్లల చదువులకి, కూతుళ్ల పెళ్లిళ్లకు సరిపోయింది. ప్రస్తుత జీవనయాత్రకు ఢోకా లేదు. పెన్షను బాగానే వస్తుంది. భార్యా భర్తలిద్దరూ పిల్లలెవరి మీదా ఆధారపడకుండా సుఖంగా జీవితం గడపగల స్తోమత వుంది. ఇంట్లో ఆవిడకు అండగా పని మనిషి, వంట మనిషి వున్నారు. ఇంట్లో ఆధునిక సౌకర్యాలన్నీ వున్నాయి. కానీ స్వంత ఇల్లు మాత్రం లేదు. స్వంత ఇంటి ప్రసక్తిలో ఒకసారి ఆయన మావారితో ఇలా అన్నారు,

"చూడండి చలపతిగారూ! మాకు స్వంత ఇల్లు లేదని మా ఆవిడ మహా బాధపడుతూ ఉంటుందండీ. నన్నడిగితే స్వంత ఇల్లు లేకపోడమే మంచి దంటాను. స్వంత ఇల్లే గనుక ఉన్నట్లయితే, మేము ఇప్పుడు చేస్తున్న ప్రయాణాలు చేయగలిగేవారమా? పిల్లలను చూడాలని వున్నప్పుడల్లా వెళ్లి చూడగలిగేవారమా? 'మన ఇల్లు మనం చూసుకోపోతే ఇంకెవరు చూస్తారు. మనం అస్తమానం ఇల్లు వదలివెడితే దాని రక్షణ, సంరక్షణ ఎవరు చూస్తారు?' అంటూ ఆ యింటిని అంటిబెట్టుకుని ఉండవలసి వచ్చేది. మేమిద్దరం అప్పుడప్పుడు ఊళ్లు తిరిగి వస్తున్నాం కాబట్టి సరిపోతోంది కానీ, సంవత్సరంలో మూడు వందల అరవై అయిదు రోజులూ ఆ స్వంత యింట్లో గడపగలిగేవాళ్లమంటారా? ఏమో! అది మాత్రం నాకు చాలా కష్టం గానే ఉండి వుండేది. అయినా అద్దె యింట్లో మాత్రం ఏం లోటుంది? డబ్బు ఇస్తున్నాం. మన అవసరాలకు తగినది చూసుకుని వుంటున్నాం."

"ఈ విషయంలో నేను మీతో ఏకీభవించనండీ. మీరు ఎన్ని చెప్పినా, స్వంత ఇల్లు స్వంత ఇల్లే. స్వంత ఇంట్లో మీకు వుండే స్వేచ్ఛ, స్వతంత్రం అద్దె ఇంట్లో వస్తాయా?" అన్నారు మావారు.

మావారికి ఖాళీగా ఉన్నప్పుడు వెంకట్రామయ్య గారితో మాట్లాడుతూ వుంటారు. ఆయనతో మాట్లాడడం వల్ల ఎన్నో విషయాలు తెలుస్తాయంటారు. ఆయనకు ఉద్యోగానుభవమే కాదు, అనేక విషయాలలో సునిశితమైన అభిప్రాయాలున్నాయి. అనేక పత్రికలు, మాగజైన్లలో విజ్ఞాన సంబంధమైన వ్యాసాలను ప్రచురిస్తూ వుంటారు. ఆయన మావారితో చాలా సన్నిహితంగా మాట్లాడుతారు. స్వంత విషయాలు చెప్పడానికి కూడా వెనుకాడరు.

ఒకసారి మాటల్లో, "చలపతిగారూ! నా రిటైర్‌మెంట్ టైమ్ దగ్గరవుతూ ఉంటే మా ఆవిడకు భయంగా వుండేది. అలవాటుపడిన గౌరవ మర్యాద లందక, తన హుందా జీవితానికి నా రిటైర్‌మెంట్ అడ్డు తగులుతుందని భయపడుతూ వుండేది. ఒక సంవత్సరమైనా ఇంకా అది సర్దుకోలేకపోతూంది. అప్పుడప్పుడు ఇంకా అంటూనే వుంటుంది 'అస్తమానం ఏదో చదవడం, రాయడం చేయకపోతే, ఏదైనా ఉద్యోగంలో చేరకూడదూ' అని. నేను ఇది వరలో మీకు చెప్పినట్లు డబ్బు సంపాదనే దాని ధ్యేయం అనను. నేను ఉద్యోగం చేస్తే, నాతోబాటు తనకు కూడా అంతస్థు పెరిగి నలుగురిలో గౌరవం పెరుగుతుందని, ఈ ప్రస్తుత అనామిక జీవితానికి అంతం కలుగు తుందని ఆశ. అప్పుడు నేను అంటాను, 'నేను మళ్ళీ ఏదైనా ఉద్యోగం చేసినా, ఏదో ప్రైవేట్ కంపెనీలో, వంశపారంపర్యంగా వచ్చిన చెయిర్మన్ షిప్ వెలిగిస్తున్న ఓ కుర్రకుంక క్రింద పనిచెయ్యాలని. దానివల్ల, గౌరవం పెరగక పోయినా, ఆత్మగౌరవం దెబ్బతింటుందని."

"అలా మీరెందుకు అనుకోవాలండీ. మీవంటి ప్రతిభావంతులను తక్కువగా చూసే అవకాశం ఎవరికైనా కలుగుతుందని నేననుకోను. మీకు ఉద్యోగం చేయాలని లేకపోతే అది వేరే సంగతి" అన్నారు మావారు.

"ఏది ఏమైనా చలపతిగారూ! నాకు మాత్రం మళ్లీ ఉద్యోగం చేయాలని లేదు. నిజం చెప్పాలంటే, ప్రస్తుతం నేను గడుపుతున్న ఈ ప్రశాంత జీవితం నాకు నచ్చింది. నేను ఇప్పుడు పూర్తి విశ్రాంతిని, మనశ్శాంతిని పొందుతున్నాను. నన్ను ఇప్పుడు ఎవరూ శాసించలేరు. ఆఖరికి టైమ్ కూడా నన్ను నియం త్రించ లేదు. నాకు వీలు కలిగినప్పుడు సమయా సమయాలతో పని లేక నాకు తోచినది చదువుకొంటున్నాను. ఏదో నాకు తెలిసిన విషయాల మీద రాసి నలుగురికీ తెలియబర్చడానికి ప్రయత్నిస్తున్నాను. ఇట్టి ప్రశాంత జీవితం నాకు ఇంత కాలానికి లభించినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను" అన్నారు వెంకట్రామయ్యగారు.

"అందరూ మీలాగా ఉండగలరని అనుకోను. రిటైరయితే ఏదో పోగొట్టు కున్నవారిలా మనోవ్యథతో నిర్జీవ జీవితాన్ని గడుపుతున్న వారు చాలామంది ఉన్నారండీ. మీలాటి ఉత్సాహవంతుల్ని చూసి నేర్చుకోవలసినది చాలా వుంది సార్" అన్నారు మావారు.

"అట్టే నన్ను పొగడకండి. నన్ను పొగిడే ముందు మా ఆవిడ అభిప్రాయం కూడా తీసుకుంటే మంచిది. ఇంట్లో నేను ప్రతి విషయంలో కలుగజేసు కుంటున్నానని, ప్రతి విషయానికి అడ్డు వస్తున్నానని దాని అభిప్రాయం. ఈ విషయంలో ఒకసారి అంది, 'హాఫ్ ది శాలరీ, ఫోర్ టైమ్స్ ది హస్బెండ్' అని ఎవరో ఆవిడ అన్నది మీ విషయంలో నిజమవుతోందని! అవును. ఈ కొటేషన్ రిటైర్ అయిన నాలాటి వారికి పూర్తిగా నప్పుతుంది. ఉద్యోగంలో వచ్చిన జీతంలో ఇప్పుడు సగమే పెన్షను వస్తోంది. ఇది వరకు నిద్ర సమయం తీసి వేస్తే ఏ నాలుగైదు గంటలో ఇంట్లో వుండేవాడిని. ఇప్పుడు రోజంతా ఇంట్లోనే గడుపుతున్నాను కదా. అంచేత ఇది వరకటి కంటె భర్త నాలుగు రెట్లు పనిలో అడ్డు వస్తున్నాడన్న మాట. ఆ 'హాఫ్ ది శాలరీ, ఫోర్ టైమ్స్ ది హస్బెండ్' అని చెప్పినావిడ చాలా తెలివైందని అంటాను. ఇంకో విషయం చెప్పమంటారా? మా ఆవిడకే కాదు, మా అబ్బాయిలకు కూడా నేను అన్ని విషయాలలో కలుగజేసుకుంటున్నాననే అభిప్రాయం వుంది. ఉద్యోగంలో రిటైర్ అయినట్లు, ఇంటి విషయాలకు సంబంధించిన నిర్ణయాలు తమకు వదిలేసి, రిటైర్‌మెంట్ విధానాన్ని అనుసరించాలని వారి ఉద్దేశ్యం. ఇంక కోడళ్ల మాట చెప్పనే అక్కర్లేదు. వారికి నేను ఇచ్చే చిన్న చిన్న సలహాలు ఎప్పుడూ నచ్చవు. నేను పానకంలో పుడకలా ప్రతిదానికీ అడ్డు వస్తున్నానని వాళ్లకి అనిపిస్తుంది. వారి స్వతంత్ర ప్రతిపత్తికి అడ్డు వస్తున్నానని అబ్బాయిల, కోడళ్ల అభిప్రాయం. వారి ఉద్దేశ్యంలో నాకు ఇది 'కృష్ణా,రామా' అనుకుంటూ కాలం గడిపే టైమ్‌గానీ, సీరియస్ విషయాల్లో కలుగజేసుకునే టైమ్ కాదని" అన్నారు వెంకట్రామయ్యగారు నవ్వుతూ.



ప్రయాణం చేసేటప్పుడు ఒక గంట ముందుగానే పిల్లలకి అన్నం కాని టిఫిన్ కాని పెట్టాలి. అదీ మితంగానే పెట్టాలి. క్రొవ్వు పదార్థాలు ఆహారంలో లేకుండా జాగ్రత్త పడాలి. ఈ చిన్న జాగ్రత్త తీసుకుంటే ప్రయాణంలో పిల్లలకి నలత అన్నది రాదు. తల్లిదండ్రులకీ కంగారు వుండదు. 'బంటి'

"అవును, మా ఆవిడ చెప్పింది. మీరు రోజూ ఒక గంట పూజా పునస్కారాలలోనూ, మంత్ర పఠనాల్లోనూ ఉంటారని" అన్నారు మావారు.

"నా పూజా పునస్కారాలు మా ఆవిడ ప్రోద్బలం. మీకు తెలియదేమో మా ఆవిడకు భక్తి చాలా ఎక్కువ. మా బంధువుల్లో ఏవైపు చూచినా ఇంత భక్తి ప్రపత్తులున్న వారు నాకు కనబడరు. అదొక పిచ్చి నమ్మకం అంటాను నేను. దేవుని మీద భక్తి అందరికీ వుంటుంది. కాని అతి ఎప్పుడూ మంచిది కాదంటాను. ఉద్యోగంలో ఉన్నప్పుడే నన్ను కూడా ఏవో మంత్రాలు వల్లె వేస్తూ ఉండమనేది. కాని అప్పుడు టైమెక్కడ? ఇప్పుడు ఖాళీగా ఉన్నాను గదా. అంచేత తప్పించుకోలేక వీలున్నప్పుడు ఏదో దైవచింతన మొదలు పెట్టాను."

"దైవం పేరు ఏవిధంగా తలచినా మంచే కలుగుతుంది కదండీ. మీ ఆవిడ పూర్తి భక్తిశ్రద్ధలతో దైవస్మరణ చేస్తూ వుంటే, మీరు, మీరన్నట్లు అంత శ్రద్ధ లేకపోయినా దైవాన్ని రోజూ తలుస్తున్నారు. మీరిద్దరూ చేసే ఈ దైవ ధ్యానం మీ కుటుంబానికి సుఖ సంతోషాలనివ్వడమే గాక, మీరిద్దరూ రోజూ చేసే ఈ పూజల వల్ల మాకు కూడా శుభం కలుగుతుందని మా నమ్మకం. అంచేత మీరు స్వంత ఇల్లు కట్టుకుని, దానిలోకి మారేవరకూ మా యింటి లోనే ఉండమని మా ప్రార్థన" అన్నారు మావారు.

సంతృప్తిగా తల వూపారు రిటైర్డ్ ఆఫీసర్ వెంకట్రామయ్యగారు. ❑